


బంగాళాఖాతంలో వాయు గుండం తీవ్రరూపం దాలుస్తోంది.

భారీ వర్షాలుపడే సూచనలున్నాయని, రేడియో ఘోషిస్తోంది. ఉదయం పది గంటలు కావస్తోంది. చిన్నగా చినుకులు పడుతున్నాయి.

"...సెలవోచ్!" అంటూ సుడిగాలిలా వాకిట్లోకి వచ్చిపడ్డాడు, పన్నెండేళ్ళ చంద్రం.

"ఆగు!" అన్న యాజులకేక పిడుగులా వినిపించింది. చంద్రం తక్కున ఆగిపోయేడు. తండ్రి తీక్షణంగా తననే చూస్తున్నాడు. తల్లీ అక్కా ముఖాల్లో భయం కొట్టవచ్చినట్లు కనబడుతోంది.

"అగ్గి పెట్టెలో అక్క దాచుకున్న డబ్బులు ఏం చేసేవు?" తండ్రి.

తలవంచుకుని ఆడంగుల్ని ఓరకంట చూసేడు చంద్రం.

తామేం పాపం ఎరగమన్నట్లు చూస్తున్నారు తల్లీ కూతుళ్ళు.

"రంకుతనం, దొంగతనం, దాచినా దాగవు"

వంచిన తల ఎత్తలేదు చంద్రం.

"తప్పేనా?" గద్దించేదు తండ్రి. గంగిరెద్దులా తల వూపేదు తనయుడు.

"అక్కకు క్షమాపణ చెప్పుకో" చంద్రం కదలలేదు. పెదవి విప్పలేదు.

"దొంగతనం చేసినప్పుడు లేకపోయిందేం ఈ దొరతనం. ఊ! కానీ!"

కానీ! ఆలస్యం చేయకు—అర్థిస్తోంది తల్లి చూపులతోనే. లజ్జతో చెంపలు ఎరుపెక్కేయి అక్క రత్నంకు.

గొణుగుడుగా క్షమాపణలు చెప్పేదు చంద్రం.

చినుకులు జోరందుకొని వర్షంగా మారింది.

"పుస్తకాలు లోపల పడేసి, గొడుగులు పట్టుకురా" అంటూ లేచి బట్టలు మార్చుకోసాగేదు యాజులు.

"ఒంట్లో బాగోలేదని సెలవుపెట్టి, ఈ వర్షంలో..." భర్త ముఖంలోకి చూసి అర్థాంతరంగా ఆపేసింది అన్నపూర్ణ.

తండ్రివెంట, గొర్రె పిల్లలా కాళ్ళీడ్చుకుంటూ బయల్దేరేదు చంద్రం.

తెరలు తెరలుగా కురుస్తున్న వర్షం మరుగున, తండ్రీ కొడుకులు కనబడే వరకూ చూసి వంటింట్లోకి వెళ్ళిపోయేరు—తల్లీ కూతుళ్ళు.

* * *

రోడ్డు పక్క కాలువలు నీళ్ళతో నిండి పొంగి ఝూమ్మని శబ్దంచేస్తూ ప్రవహిస్తున్నాయి. రోడ్డు మీద నీళ్ళు అందుకు ఏం తీసిపోలేదు. చెత్తా చెదారం, రాళ్ళూ, రప్పలూ, కొండొకచో గాజుపెంకులూ వర్షం నీళ్ళు రోడ్డు మీద ప్రవహిస్తున్నాయి. కాళ్ళు ఎత్తెత్తి జాగ్రతా నడుస్తున్నారు జనం. నీటి ప్రవాహం వాళ్ళ అంచనాలను తారుమారు చేస్తూ వారిచేత తప్పటడుగులు వేయిస్తున్నది.

తండ్రీ కొడుకులకి కొద్దిగా ముందు నడుస్తున్న కుర్రాడు చంద్రం సమ వయస్కుడు ఉన్నట్టుండి "అబ్బా!" అని అరచి కుడికాలు ఎత్తి నుంచున్నాడు. కాలిలో గాజుపెంకు గుచ్చుకుంది. రక్తం ధారగా కారి వర్షం నీటిని ఎర్రబరుస్తోంది. అతడి కాళ్ళకు చెప్పులు లేవు. తలకు ఆచ్ఛాదన లేదు. తల తడిసి నీళ్ళు కళ్ళల్లో పడుతున్నాయి.

చంద్రం అప్రయత్నంగా తన కాళ్ళకున్న చెప్పులు చూసుకున్నాడు.

దగ్గరలోని కిళ్ళీ కొట్లో, ఆ కుర్రాడికి కాచూ సున్నం పట్టు వేయించి, 'జాగ్రత్త' అని హెచ్చరించాడు యాజులు. తండ్రినీ, ఆ కుర్రాడినీ మార్చి మార్చి చూసేదు చంద్రం.

* * *

వర్షం కుండపోతగా కురుస్తూనే వుంది. మార్కెట్లో అడుగు పెట్టేరు తండ్రీ కొడుకులు.

తలదాచుకు లేనివాళ్ళు లెక్కకు మించి ఉన్నారు. వాళ్ళందరూ కూలీ నాలీ జనాలు. చాటో, బుట్టో, ప్లాస్టిక్ కవరో నెత్తిన కప్పుకున్నారు—కొందరు. అయినా నెత్తికీ ఒంటికీ తగినంత రక్షణ కల్పిస్తున్న సూచనలేమీ లేవు.

కొందరు షాపుల్లో దూరితే, కూలీనాలీ మెట్ల మీద నుంచున్నారు.

తండ్రీ కొడుకులు ఇద్దరికీ గొడుగులున్నా తల కొద్దిగా తడిసింది. కాళ్ళక్రింది భాగం బట్టలు తడిసేయి. చలి ఒంట్లోకి పాకుతోంది. చంద్రం కొద్దిగా వణకసాగేదు.

గాలి బాగా వీస్తోంది. గొడుగులు ఉండటం లేదు. జల్లుకి బట్టలు బాగా తడవనారంభించాయి. ఇద్దరూ ఓ మందుల షాపు మెట్లెక్కారు. వాళ్ళ వేషధారణ చూసి వాళ్ళని బాగా లోపలికి రానిచ్చాడు షాపువాడు. కూలీనాలీని బైటికి తరుముతున్నాడు. జల్లు కొట్టినప్పుడల్లా వాళ్ళు తడుస్తూనే ఉన్నారు.

తడుస్తున్న జనం చేతులు కట్టుకొని బిగదీసుకుని నుంచున్నారు. చిన్నగా వణుకుతూ. ఇద్దరు కూలీలు వంతుల వారీగా చుట్ట కాలుస్తూ వెచ్చదనం పొందుతున్నారు.

షాపులో వెచ్చగా ఉంది. చంద్రంకి సుఖంగా ఉండనిపిస్తోంది.

* * *

కూర్ల బస్తాలు లాగుడు బండి మీద వేసి ఇద్దరు కుర్రాళ్ళు లాగుతూంటే మరో ఇద్దరు వెనుక నుంచి తోస్తున్నారు. వాళ్ళ తలలు తడుస్తున్నాయి. నీళ్ళు కళ్ళల్లో పడుతున్నాయి. చలికి వణుకుతున్నారు. వాళ్ళు వయసులో చంద్రం కన్నా చిన్న.

దారి సరిగ్గా కనబడకనో, లేకనో బండి ఊగుతూ తూగుతూ అతి కష్టం మీద ముందుకు సాగుతోంది.

యాజులు కొడుకువేపు చూసాడు. చంద్రం బండి వేపే చూస్తూ సన్నగా వణకసాగేడు. తన ఒంటి మీద సాలువని కొడుక్కి కప్పి సర్దేడు. తల తడిమి చూసి రుమాలుతో తుడిచేడు యాజులు.

తండ్రికి దగ్గరగా చేరి నించున్నాడు. ఇంకా వెచ్చగా సుఖంగా అనిపించింది చంద్రంకు. కూరలవాడు కూలీ చెల్లించినట్లున్నాడు–ఆ నలుగురికి. ఎదర టీ కొట్లో నాలుగు బన్ను రొట్టెలూ, టూ బై ఫోర్ చాయ్, రెండు బీడీలూ తీసుకున్నారు. వాళ్ళ చేతుల్లో ఏమీ మిగల్లేదు.

బీడీలు వంతులవారీగా కాలుస్తూ మరో బేరం కోసం ఎదురుచూస్తున్నారు.

వాళ్ళని చంద్రం ఎరుగును. ఐదో తరగతిలో తనతో చదివిన వారే. పరీక్షల్లో ఫెయిలైతే కూలి పనుల్లో పెట్టేసేరు వాళ్ళవాళ్ళు.

వాళ్ళతో పోలిస్తే, తాను ఎంతో సుఖంగా వున్నట్లు అనిపించి తండ్రికి మరింత దగ్గరగా చేరేడు.

* * *

"చాల్చాల్లే!...ఇచ్చేయ్!..." షావువాడు ఓ ముసిల్దానితో ఘర్షణ పడుతున్నాడు. ముసిల్ది బాగా తడిసిపోయింది. వణుకుతూ బ్రతిమాలుతోంది.

"బాబ్బాబు! మా బొట్టెడు... ఇదిగో ఈ బాబంతుంటాడు" అని చంద్రంని చూపి "కూలి కెళ్ళి వర్షంలో తడిసిపోయాడు. ఒళ్ళు జొరంతో సలసలా కాగిపోతోంది.

జొరం తగ్గకపోతే కూలీ లేదు. కూలీ లేకపోతే పొట్ట గడవదు. పిల్లా మేకా పస్తున్నాం, నీ ఋణం ఉంచుకోను...పైసలు రేపో మాపో యిచ్చేస్తా..." దేబిరిస్తోంది ముసల్ది.

షావువాడు కుదర్దన్నాడు. మిగతా వాళ్ళంతా చోద్యం చూస్తున్నారు. ఇంకో బేరం వచ్చింది. పాతిక రూపాయలు, ఐదు రూపాయలు తక్కువ వచ్చింది.

"దానికేం సార్! రేపివ్వండి!" షావువాడు.



పెళ్ళిపందిరిలో పెళ్ళి జరుగుతోంది. అందరూ పెళ్ళికూతురికి, పెళ్ళికొడుక్కీ కానుకలివ్వసాగారు.

పురోహితుడు : పెళ్ళికూతురికి ఆమె తల్లి ఆశీర్వదించి అప్పడాల కర్ర కానుకగా ఇచ్చింది.

మరో పురోహితుడు : పెళ్ళికొడుకుకు అతని తండ్రి ఆశీర్వదించి ఒక హెల్మెట్ కానుకగా ఇచ్చాడు.

– జి. రామలక్ష్మి

నీటుగా బట్టలు వేసుకున్న కష్టమర్ఫతో. ముసలామె మళ్ళా బ్రతిమాలసాగింది. ఆమెనిచూస్తే జాలేస్తోంది–చంద్రకి. తనకు జ్వరం వచ్చినపుడు, తండ్రి తెచ్చిన మందులు వేసుకోనని తాను చేసిన మొరాయింపులూ, హఠాలూ జ్ఞాపకం వచ్చేయి.

"ఎంత?" అప్రయత్నంగా అడిగేడు చంద్రం. తండ్రీ కొడుకుల్ని మార్చి మార్చి చూస్తూ "ఇదంతా వేషం...టక్కులమారి బజార్లో ఇలాంటి వాళ్ళు కోకొల్లలు"అన్నాడు షావువాడు. తన జేబులోంచీ, అక్క దగ్గర కొట్టేసిన డబ్బుల్లోంచి ఒక నోటు తీసిచ్చేడు చంద్ర. షావువాడు యాజుల దిశ ఒకసారి చూసి నోటందుకుని చిల్లర చంద్రం చేతిలో పెట్టేడు.

ముసిల్ది నోరారా దీవించి వర్షంలో సాధ్యమైనంత వేగంగా సాగిపోయింది.

చంద్రంకి గర్వంగా ఉంది. తండ్రి వేపు చూసేడు. అతని చూపు చినుకుల్లో చిక్కుకుంది.

* * *

వర్షం తెరిపి ఇచ్చింది.

అంతసేపూ తల దాచుకున్న వాళ్ళంతా రోడ్డు మీదకి వెళ్ళేరు. తండ్రీ కొడుకులు బజారు దారి లోతట్టు ప్రాంతంకి వచ్చేరు.

మోకాళ్ళ ఎత్తు నీళ్ళు నిలిచి ఉన్నాయి. చాలా ఇళ్ళు–ముఖ్యంగా గుడిసెలు. మునిగిపోయేయి. నీళ్ళ మీద తేలే తప్పేళాలూ వగైరా బయటకు కొట్టుకొస్తున్నాయి. వాటిని వేటాడి పట్టుకుంటున్నారు–పిల్లలు. కొప్పింటిని గూర్చి ఇది మాదంటే మాదని తగువు లాడుకుని కొట్టుకునే వరకూ వెళ్తున్నారు

సామాన్లు నెత్తినా, చంకనా, చేతుల్లో పెట్టి పట్టుకుని పిల్లా ముసిలికి ఊతనిస్తూ దగ్గరలో ఎత్తునున్న స్కూల్లోకి చేరుకుంటున్నారు. గదులు నిండిపోయాయి. వరండాలు డాబా కూడా నిండిపోయాయి. కాలుమోప చోటులేదు. అయినా జనం వస్తూనే వున్నారు.

చోటు లేక వాదులాడుకుంటున్నారు. బూతులకి లంకించుకుంటున్నారు. కుమ్ములాడుకుంటున్నారు.

పిల్లల ఆకలి కేకలు పట్టించుకునే వాళ్ళే లేరు. పట్టించుకున్న వాళ్ళు ఆశగా దిక్కులు చూస్తున్నారు. వాళ్ళ పరిస్థితి అదే. దిక్కుతోచని పరిస్థితులలో అధికార్లూ అనధికార్లూ హడావుడిగా తిరుగుతూ ముఖం చాటేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితులలో అదిగో ఇదిగో అని కప్పదాట్లు వేస్తున్నారు.

చంద్రంకి ఆకలి అనిపించింది. ఇంట్లో అమ్మా అక్కా చేస్తున్న పులగం, మాగాయ పెరుగు పచ్చడీ, నూలుకుండా, అప్పడాలూ వడియాలూ, వెన్నా నెయ్యీ గుర్తు వచ్చేయి. ఇంటికి వెళ్ళాక పుష్టిగా తిని, దుప్పటీ కప్పుకుని వెచ్చగా పడుకునే సంగతి జ్ఞాపకం వచ్చింది.

మళ్ళా చినుకుల జోరు హెచ్చింది. తండ్రీ కొడుకులు మోకాటి లోతు నీట్లోంచి బయటపడ్డానికి ప్రయత్నం ప్రారంభించేరు. దారిపొడుగునా ముంపుకి గురి అయిన వారి జీవితం చూస్తూంటేం దుర్భరం అనిపించి వణుకు పట్టింది చంద్రంకి.

* * *

"మేష్టారూ!" చిన్న కేక వినిపించింది. యాజులు తలతిప్పి చూసేడు. రోడ్డుపక్క డొక్కు టీ హోటల్లో సాయిబు. "రండీ సాబ్!" పిలుస్తున్నాడు. తండ్రీ కొడుకులు లోనికి దూరేరు.

మర్యాద చేసి వార్ని కూర్చోబెట్టి ఇద్దరికీ టీ ఇచ్చేడు. టీ గొంతుకలో దిగుతూంటే వెచ్చదనం పుట్టుకొస్తోంది. సత్తువ వస్తోంది. మనసుకి ఉల్లాసం కలుగుతోంది. టీ త్రాగటం ముగించేరు. అలా త్రాగుతూ వెచ్చగా అక్కడే కూర్చోవాలనిపిస్తోంది–చంద్రంకి.

గ్లాసులు తీయడానికి వచ్చిన కుర్రాడ్ని చూసి యాజులు ఆశ్చర్యపోయేడు. వాళ్ళని చూసి ఆ కుర్రాడు బిత్తరపోయి, తల వంచుకుని గ్లాసులు తీసుకుని పరుగు పరుగున లోపలికి పారిపోయాడు.

"సాయిబూ! మీవాడేనా? చదువు మానిపించేసి పనిలో పెట్టేవా! కనబడకపోతే

"ఒంట్లో బాగోలేదేమో అని అనుకున్నాను సుమీ!" యాజులు.

"మాన్పించేసాన్ సాబ్! ఆడు... రుచులు ~ర్గిందు! ఆడ్కి కష్టం ఎిల్వ తెల్వద్!"

"తెలివైన వాడేనే! మావాడి కన్నా చాలా నయం. ఏం చేసేదేవిటి!?"

"అరేయ్! హుస్సేన్!... అదివే అడగండి సాబ్! జర షరమైన వస్తాది!"

హుస్సేన్ వచ్చి తల వంచుకున్నాడు. కళ్లల్లో నీళ్లు ఉబికి వస్తున్నాయి. పెదాలు బిగబట్టి దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

వాడి రెక్క పుచ్చుకొని దగ్గరకు తీసుకొని భుజం మీద చెయ్యి వేసి లాలనగా ఏం జరిగింటో చెప్ప మన్నాడు యాజులు. వాడు ఘొల్లుమన్నాడు. వెక్కిళ్ల మధ్య చెప్పసాగేడు.

భుజంగం అనేవాడు రోజూ జేబు ఖర్చుకి బోల్డు డబ్బులు తెస్తాడట... ఇంటర్‌వెల్ టైమ్‌లో వాడి వెనుక చాలామంది తిరుగుతారట... వాళ్లల్లో తనూ, చంద్రం కూడా వున్నారట... వాడు చిల్లర తిళ్లు కొనిపెట్టి వీళ్ల మీద ధాష్టీకం చెలా యిస్తాడట... అప్పుడప్పుడు కుక్కకన్నా హీనంగా చూస్తాడట...

వీళ్లిద్దరికీ అది నచ్చలేదట... వాడు మప్పిన రుచులకు దాసోహమై, అందిన చోటల్లా డబ్బులు కాజేసేడట... తండ్రికి పట్టుబడిపోయేడట... చావ బాది, ఈ కప్పలు కడిగే పనిలో పెట్టేసాడట...

ఈ పని తనకు ఇష్టం లేదట... చదుకోవా లని ఉందట... ఇంకెప్పుడూ దొంగతనం చెయ్యనని తండ్రి కాళ్ళావేళ్ళా పడ్డాడట... తండ్రి వినలేదట...

"... తప్పు తెల్సింది సార్! ఇంకెప్పుడూ చేయను సార్! మీరైనా చెప్పండి సార్!" అంటూ యాజుల కాళ్ల మీద పడి వలవలా ఏడవసాగేడు హుస్సేన్.

"సాయిబూ! నువ్వు చేసింది తప్పనను. తప్పు తెలుసుకొని సరిదిద్దుకుంటాను అన్నవాడిని మించి నవాడు లేడు. మొదటి తప్పుగా క్షమించి, ఒక అవ కాశం ఇచ్చి చూడు. లేకపోతే నీ మందు వుండనే వుంది. ఏమంటావ్?" యాజులు నచ్చజెప్పేడు.

"సరే! సాబ్! మీదీ మాటా కొట్టేయ్ లేను!" అన్నాడు సాయిబు – చాలాసేపు ఆలోచించి.

హుస్సేన్ ముఖం వికసించింది. కళ్లల్లో మెరుపు. అప్రయత్నంగా చేతులు జోడించేడు.


"బుద్ధిగా చదువుకో! వృద్ధిలోకి వస్తావు" అని వాడి భుజం తట్టి, సాయిబు దగ్గర సెలవు తీసు కున్నాడు యాజులు.

చంద్రం కళ్లల్లో నీళ్లు తిరిగేయి. కళ్ళు మస కబారాయి. అడ్డంగా వున్న రాయిని తన్నుకొని పడబోయాడు. యాజులు గబుక్కున పట్టుకొని ఊతనిచ్చాడు.

***

వర్షం తుంపర్లు తుంపర్లుగా పడుతోంది.

"నమస్కారం మేస్టారూ!" పల్కరించినతను సూటూ బూటూలో ఆఫీసర్లాగున్నాడు. యాజులు గుర్తుపట్టలేకపోయాడు. చిన్న బంగళా గేట్లోంచి వస్తున్నాడు.




"నేను మాస్టారూ! పుల్లయ్యని... పదేళ్ల క్రితం అచ్చియమ్మ పేటలో... మీ ఇంటి ఎదర పాకలో..." అప్పుడు గుర్తొచ్చింది యాజులుకు.

"ఓహో! నువ్వటయ్యా! బాగున్నావా!" పాత శిష్యులు ఎవరు ఎదురైనా ఆయన వంతు ఇదే. అతని ఇల్లు కాబోను ముచ్చటగా వుంది. పోర్టి కోలో స్కూటరూ, కారూ వున్నాయి.

"అంతా మీ దయ! లోపలికి రండి సార్! అమ్మ చూస్తే సంతోషిస్తుంది" అంటూ బలవం తాన ఇంట్లోకి తీసుకుపోయాడు.

ఇంటిల్లపాదినీ పిలిచాడు. అంతా వచ్చారు. అతని తల్లి యాజుల్ని చూడగానే – "బాబు గారు!... ఎంత మంచిరోజు బాబూ! ఏవే లచ్మీ! నే చెబుతూండేదాన్నే యాజులయ్యగోరని... ఆరే ఈరు..." అంటూ తెగ సంబరపడిపోయింది.

"కూర్చోండి బాబూ! మన బాబే!... ఎంత పెద్దో డైపోవాడూ! అమ్మగారూ, అమ్మాయీ బాగున్నారా బాబూ! ఎన్నాళ్లైపోయిందో సూసి... వచ్చిందగ్గర్నించీ బాబుగారింటికి ఓపాలి తీసుకెళ్లరా! అంటే... ఈ ముదన... ఈయేలా రేపూ అంటాడేగానీ తీసుకు రాడు" అంటూ తెగ బాధపడిపోయింది.

పిల్లలూ, భార్యా, తనూ యాజుల కాళ్లకు దండాలు పెట్టారు – అతడు ఎంత వారిస్తున్నా వినిపించుకోకుండా.

"పెట్టనీండి బాబూ! అది కృతజ్ఞత అలాంటిది. ఈనాడు మాం ఇలా వున్నావంటే అదంతా మీ సలవ కాదూ! ఇద్యా దానం సేసి బుద్దులు నేర్పి నోరు మీరు. మీకేటిసేస్తే మా ఋణం తీరుతాది!" అంది కళ్లలో చిప్పిల్లిన నీళ్ళను పైటకొంగుతో ఒత్తుకుంటూ.

యాజులకి మహా ఇబ్బందిగా వుంది. చంద్రంకి ఇదో కొత్త అనుభవం – సినిమాలోలా.

బలవంతాన బిస్కెట్లు తినిపించి, హార్లిక్స్ తాగిం చేరు, ఇద్దరిచేతా. లోపల వెలుపలా వెచ్చగా వుంది. వర్షం తగ్గేదాకా ఇక్కడే వుండిపోతే బాగుందువ నిపిస్తోంది చంద్రంకి.

వాళ్ళు వున్నంతసేపూ కోడలికీ, మనవలకీ యాజులు గూర్చే చెప్పడం, పొగడడంతోనే సరిపో యింది ముసిల్దానికి. ఈ పదేళ్లలో తన అభివృద్ధి గూర్చి పూసగుచ్చినట్టు చెప్పేడు పుల్లయ్య. ఆపైన రేపుటెల్లుండిలో సకుటుంబంగా వచ్చి అమ్మగార్ని దర్శనం చేసుకుంటామన్నారు.

వేళమించిపోయిందని లేచేడు యాజులు.

చంద్రం బుగ్గలు పుణికిపుచ్చుకొని – "బాబుగారి సలవ వల్ల మావాడు ఇంతోటి వాడయ్యేడు... ఆరి అబ్బాయివి దాకిటేరే అవుతావో, కలికిటేరువే అవుతావో" అని ముచ్చటపడింది ముసిల్ది.

చంద్రంకి సిగ్గేసింది. తనకి వచ్చే బొటాబొటీ మార్కులతో ప్యూన్ ఉద్యోగం కూడా రాదని తండ్రి బాధపడడం గుర్తొచ్చి తల దించేసుకున్నాడు.

కార్లో దించుతాను అన్నా వేరే పనుందని ఇంటి దారి పట్టేడు యాజులు.

***

వర్షం తెరిపి ఇచ్చింది. సినిమా హాలు దగ్గర బస్ స్టాపుకి వచ్చారు. నడిచే ఓపిక నస్సగిల్లి అక్కడ నించున్నారు.

ఒక మూల మూడు ముక్కలాట జోరుగా సాగుతోంది. మొదటి రెండు మూడు కలువు లకీ పందెం కాసిన వాళ్ళకు రెట్టింపు అందింది. దానితో పందెం కాసేవాళ్ళు ఎక్కువయ్యేరు. అప్ప ట్నుంచీ పందెం కాసిన వాళ్ళకు పోవడమేగానీ, వచ్చిన దాఖలాలు లేవు.


ఇంకో మూల అష్టావెమ్మా. మరింకో చోట పులీ మేకా. ఇంకోచోట మంచం పట్టీ. అన్నీ జూదాలే. ఆడేవాళ్ళంతా కూలీనాలీ జనాలే.

బస్సు ఒక్కటీ వచ్చిన పాపాన పోలేదు. వచ్చిన బస్సు కిటకిటలాడిపోతోంది. ఎక్కే వీలు లేదు. నడిచే ఓపికా లేదు. బిస్కెట్లూ, టీ, హార్లిక్సులూ ఆకలి తీర్చలేదు. వాతావరణం వల్లనో తిరుగుడు వల్లనో మరెందుచేతనో విపరీతమైన ఆకలి వేస్తోంది.

# శ్రుతిలయలు సంజయ్, చౌక్కాపు సిస్టర్స్‌కు అభినయ ఆర్ట్స్ అవార్డ్స్

ప్రముఖ యువ ఆంధ్ర నాట్య కళాకారుడు, స్త్రీ పాత్రలో విశేష ఖ్యాతినొంది శ్రుతిలయలు చిత్రం ద్వారా అశేష జన హృదయాలను దోచిన శ్రీ ఎ.ఎస్. సంజయ్, మేజిక్, మైమ్ ప్రదర్శనల ద్వారా పలువురి మన్ననలందుకుంటున్న హైదరాబాద్‌కు చెందిన చౌక్కాపు సిస్టర్స్ కొండవీటి బ్రదర్స్ అభినయ ఆర్ట్స్ అవార్డ్స్–'95కు ఎంపికయ్యారు.

విజయవాడలో జరిగిన అభినయ ఆర్ట్స్ ఫెస్టివల్‌లో వీరికి అవార్డుల ప్రదానం జరిగింది.



చౌక్కాపు సిస్టర్స్‌కు అభినయ ఆర్ట్స్ అవార్డు (95)ను అందజేస్తున్న అడిషనల్ డి.జి.పి. శ్రీ ఎ.పి. వి. నాయకర్.



ఎ.ఎస్. సంజయ్ (శ్రుతిలయలు)కు అవార్డునందజేస్తున్న ప్రభుత్వ కార్యదర్శి శ్రీమతి ఎ. వనజాక్షి,

---

మళ్లా చినుకులు ప్రారంభం అయ్యాయి. రిక్షా వాళ్ళను అడిగితే, ఎవరూ పట్టించుకోలేదు. పట్టించుకున్నవాడు మేమూ మనుషులమే అన్నాడు. రిక్షా కట్టనన్నాడు.

"ఎందుకు కడతారండీ! అదంతా జూదం మహిమ. సంపాదించిన ఆ మాత్రం ఈ మాత్రంతో అనాయాసంగా మరింత సంపాదించేద్దామనే అత్యాశ. అందులో నష్టపోతారు. బతుకులెలా బాగుపడతాయి. చదువు లేనోళ్ళు... అంతే. వాళ్ళే ఏమిటిలెండి! చదువుకున్నవాళ్ళూ అంతే..." అంటూ బాధపడిపోయేడో ప్రయాణీకుడు.

ఇహ లాభం లేదనుకొని నడక ప్రారంభించేరు –. తండ్రీ కొడుకులు.

జూదంకీ, త్రాగుడికీ వచ్చిందంతా తగలేయడంతో తిండికి గడవక తమ ఇంటి దగ్గర్లో వుండే అచ్చెమ్మా, దాని పిల్లలూ పురుగుల మందు మింగి చనిపోయిన సంగతి జ్ఞాపకం వచ్చింది చంద్రంకి.

***

వర్షం చినుకూ చినుకూగా పడుతోంది.

చిట్టచివరికి ఇల్లు చేరారు తండ్రీ కొడుకులు. ఆడవాళ్ళిద్దరూ వీళ్ళిద్దరి కోసం గుమ్మంలో నించొని ఆత్రంగా ఎదురుతెన్నులు చూస్తున్నారు.

చంద్రం ఇంట్లోకి రాగానే తల్లి తల తుడిచింది. యాజులు తనే తుడుచుకున్నాడు. తండ్రీ తమ్ముళ్లకు పొడి బట్టలు ఇచ్చింది రత్నం. వాళ్ళులవి కట్టుకునే లోపల భోజనాలు వడ్డించేరు.

వంటకాలు వేడివేడిగా వున్నాయి. రుచికరంగా వున్నాయి. అంతా మౌనంగానే భోజనాలు చేసేరు.

యాజులు గంభీరంగా తమ మడతకుర్చీలో కూర్చున్నాడు. ఆడవాళ్ళు వాళ్ళ పనుల్లో పడ్డారు.

***

చంద్రం కడుపు నిండింది. పొడి బట్టలమీద దగ్గు వెచ్చదనాన్ని ఇస్తోంది. అదే ఇంకోరోజైతే మస్తుగా నిద్రపోయేవాడే. కానీ ఈ రోజు కునుకు రావడం లేదు.

కళ్ళుమూసినా తెరచినా ఉదయం నుంచీ చూసిన దృశ్యాలు సినీమాలా వరుసగా మళ్ళా మళ్ళా కనబడుతున్నాయి. అలాంటి దృశ్యాలు తను ఇదివరకు అప్పుడూ, ఇప్పుడూ చూడకపోలేదు. తనకేమీ అనిపించలేదు. కానీ, ఈ వేళ గొలుసుకట్టుగా చూసేడు.

దొంగతనం చేసిన తనని తండ్రి ఏమీ అనలేదు, దండించలేదు. ఒంట్లో నలతగావున్నా ఊరంతా తిప్పి... జనాన్నీ... వాళ్ళ కష్టాలనూ చూపించి తీసుకొచ్చేరు.

ఆలోచిస్తున్నకొలదీ చంద్రంకి లీలగా ఏదో తెలిసివస్తోంది. చిరుతిళ్లు... రుచులు... దొంగతనాలు... చదువు లేకపోవడం... బీదతనం... అజ్ఞానం... కష్టాలు.

చదువుకుంటే జ్ఞానం ... ఉన్నత ఉద్యోగం, హోదా... గౌరవ మర్యాదలు, లేకపోతే ఛీత్కారాలూ అవమానాలూ.

వుల్లయ్య తల్లి మాటలూ, అచ్చెమ్మ పిల్లల చావు.

ఆలోచనల్లోనే దుఃఖం రాసాగింది. కళ్ళంట నీరు చిప్పి, కళ్ళు నిండిపారసాగేయి. అది కట్టలు తెంచుకుంది. ఎక్కిఎక్కి ఏడవసాగాడు.

ఎక్కడ పని అక్కడ వదిలేసి, వాడిని పొదివి పట్టుకొని ఊరడించసాగేరు ఆడంగులు. ఊరడిస్తున్న కొలదీ వాడి దుఃఖం పెరిగిపోతోంది. గాభరాగా యాజుల వేపు చూసేరు తల్లీకూతుళ్ళు.

వాళ్ళకి అభయమిస్తూ చంద్రంని చేరేడు – యాజులు. తండ్రి ఎదలో ముఖం దాచుకొని ఉక్కిర్లు బిక్కిరిగా ఏడుస్తున్నాడు. యాజుల గుండె తడిసిపోయింది. కళ్లంటనీళ్ళు తిరిగేయి. తల్లీకూతుళ్ళ కళ్ళంట నీళ్ళు తిరిగాయి. ఇంటిల్లపాదీ కన్నీళ్ళతో చంద్రంలోని మచ్చ కడుక్కుపోసాగింది. ఆకాశంలో మబ్బులు ఒక్కసారిగా తొలగిపోయాయి. మచ్చలేని నిండు చంద్రుడు స్వచ్ఛంగా ఉదయిస్తున్నాడు.